**నీలగిరి ఎక్స్‌ప్రెస్**

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 348 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 12-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

కరియు దారిఁబోవ కదలి శునకములు
అరచిగోలజేయు నవనియందు
బుధులజూచి గూడ మూర్ఖులు నిట్టులే
వదరుబోతులుగను వాగుచుంద్రు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# తేలిపోయిన సన్‌రైజర్స్ బౌలర్లు !



- ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్‌కు మూడో ఓటమి
- పంజాబ్ కింగ్స్ చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం
- అభిషేక్ శర్మ 28 బంతుల్లో 74 రన్స్
- శివంగ్ కుమార్ మినహా సన్ రైజర్స్ బౌలర్లంతా దారుణంగా విఫలం
- 219 రన్స్ కొట్టినా కాపాడలేకపోయిన బౌలర్లు

న్యూఢిల్లీ

ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో ఓటమిని చవిచూసింది. శనివారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచులో 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. బ్యాటర్లు రాణించడంతో 219 రన్స్ చేసినా.. బౌలర్ల వైఫల్యంతో మరో ఓటమిని ఖాతాలో వేసుకుంది. ఈ టోర్నీలో మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న పంజాబ్ కింగ్స్.. పాయింట్స్ టేబుల్‌లో 7 పాయింట్లతో రెండో -మిగతా 2 లో



## బెంగాల్‌లో తృణమూల్‌కు ఓటమి భయం

- అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు
- బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తాం
- పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం.
- బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ

కోల్‌కతా,

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత -మిగతా 2 లో

# దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

### 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు

- నియోజకవర్గాల పునర్విభజనలో అంతరం
- 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్రం వద్ద పెండింగ్
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం
- రవీంద్రభారతిలో పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి




హైదరాబాద్,

కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు -మిగతా 2 లో



## పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

- విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం
- అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ
- కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటన

హైదరాబాద్,

ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతి రావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే -మిగతా 2 లో




## 200కు పైగా సీట్లలో గెలుస్తున్నాం

- ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వ ఏర్పాటు
- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా
- అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారింది

చెన్నై,

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారతా పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల -మిగతా 2 లో

## యూపీఐ పేమెంట్స్‌కు పదేళ్లు పూర్తి..





- 49 శాతం వాటాతో భారత్‌దే అగ్రస్థానం..!

న్యూఢిల్లీ

భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రియల్-టైమ్ చెల్లింపుల లావాదేవీల్లో ఏకంగా 49 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని తెలిపింది. గణాంకాల ప్రకారం.. కేవలం 2026 జనవరి నెలలోనే యూపీఐ ద్వారా -మిగతా 2 లో

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి.
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.
- అధికారికంగా ప్రకటించిన బోర్డు




హైదరాబాద్

తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు -మిగతా 2 లో



## ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కు

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించింది
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు
- తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసే యత్నం
- ఎన్నికల ప్రచారసభలో మమతా బెనర్జీ విమర్శలు

కోల్‌కతా,

ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కై భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు ప్రయత్నించినట్టు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. పశ్చిమ మేదినిపూర్ జిల్లాలోని కేషియారిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, తనపై తప్పుడు కేసులు బనాయించడం ద్వారా భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని అన్నారు. అయితే ఆ పార్టీ గేమ్ ప్లాన్‌ను టీఎంసీ కార్యకర్తలు, ప్రజలు భగ్నం చేశారని తెలిపారు. భవనాపూర్‌లో మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీలో ఉన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించిందని మమతా బెనర్జీ ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆ కారణంగానే లక్షలాది ఓటర్లను వాళ్లు తొలగించారని, -మిగతా 2 లో

# ఎప్పుడు ఎన్నికలొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలే




### కేసీఆర్ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు

- అనేక హామీలతో డబ్బా కొట్టుకున్న రేవంత్
- నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం
- రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు
- మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నాడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నాడు..
- ఇబ్రహింపట్నం కార్యకర్తల భేటీలో కేటీఆర్

హైదరాబాద్,

ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి -మిగతా 2 లో




## బీఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

- ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరం
- బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు
- బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు.
- కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

ములుగు,

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. శనివారం ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. -మిగతా 2 లో

# తేలిపోయిన సన్‌రైజర్స్ బౌలర్లు !

మొదటి తరువాయి



స్థానంలో నిలిచింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 28 బంతుల్లో 74 రన్స్ చేశాడు. సన్ రైజర్స్ భారీ స్కోరు చేయడంతో విజయంపై ధీమాగా ఉంది. కానీ సన్ రైజర్స్ బౌలర్లు మాత్రం పంజాబ్ కింగ్స్ బ్యాటర్ల ముందు తేలిపోయారు. పవర్ ప్లేలోనే మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పేశారు ఆ జట్టు బ్యాటర్లు. సన్ రైజర్స్ హైదరాబాద్ పవర్ ప్లేలో 105/1 చేయగా.. పంజాబ్ కింగ్స్ కూడా ధాటిగా బదులిచ్చింది. పవర్ ప్లే ముగిసే సరికి 93/0తో నిలిచింది. ప్రియాన్ష్ ఆర్యా 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. ప్రభ్ సిమ్రాన్ సింగ్ (25 బంతుల్లో 51 రన్స్) కూడా సత్తాచాటడంతో పంజాబ్ ఆధిపత్యం చలాయించింది. ప్రియాన్ష్ (20 బంతుల్లో 57 పరుగులు) ఔట్ అయిన తర్వాత శ్రేయస్ అయ్యర్ బాధ్యత తీసుకున్నాడు. 33 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించాడు. పంజాబ్ కింగ్స్ 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ టోర్నీలో మూడో విజయాన్ని సాధించింది. శివంగ్ కుమార్ మినహా సన్ రైజర్స్ బౌలర్లంతా దారుణంగా విఫలమయ్యారు. శివంగ్ 4 ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. జయదేవ్ ఉనద్కత్ 3 ఓవర్లు వేసి 40 పరుగులు, ఎషాన్ మలింగ 3 ఓవర్లలో 46 పరుగులు, హర్షల్ పటేల్ 2 ఓవర్లలో 39 పరుగులు సమర్పించుకున్నారు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 2026లో మూడో ఓటమిని చవిచూసింది.

## బెంగాల్‌లో తృణమూల్‌కు
# ఓటమి భయం

మొదటి తరువాయి

కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్బ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# 200కు పైగా సీట్లలో గెలుస్తున్నాం

మొదటి తరువాయి

మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. సెక్యులర్ ప్రొగ్రసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని స్టాలిన్ తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై అడిగినప్పుడు, సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిసాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 9న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలను స్టాలిన్ కొట్టివేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలపై పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు ఒక నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్‌పై కూడా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు.

# ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కు

మొదటి తరువాయి

ఫలితాలు తమకు అనుకూలంగా ఉండేలా ఈవీఎంల ట్యాంపరింగ్ చేసే ఆలోచనలో కూడా ఉన్నారని అన్నారు. ఎస్ఐఆర్ పక్రియ కారణంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తొలగించిన 90 లక్షల మంది ఓటర్లలో 60 లక్షల మంది హిందువులు, 30 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. బెంగాలీ మాట్లాడినంత మాత్రమే మనం భారతీయులం కాదా? నిరంతరం పౌరసత్వం నిరూపించుకోవాలా?' అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామంటూ బీజేపీ ఎన్నికల హామీపై మాట్లాడుతూ, ఈ చర్యను వెనుకబడిన వర్గాలపై నేరుగా దాడి చేసేందుకు, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కొల్లగొట్టేందుకు జరుపుతున్న దాడిగా ఆమె పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో యూసీసీని అమలు చేసేది లేదన్నారు. రాష్ట్రంలో వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చి.. ఢిల్లీలో బీజేపీకి ఉద్వాసన పలుకుతామని, ఆ వెంటనే యూసీసీని రద్దు చేస్తామని మమత స్పష్టం చేశారు.

# పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

మొదటి తరువాయి

జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి



చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు.

పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జా&ఝనాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్ర్యం÷-ర రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

మొదటి తరువాయి

ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని డిప్యూటీ సీఎం వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎయోజకవర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజా ప్రభుత్వం బడ్జెట్లో పెద్ద ఎత్తున ప్రజలే కేంద్రంగా నిధులు కేటాయించింది ఇదే జరిగితే తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని భావించి రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకీకరణ ప్రయత్నం జరుగుతుందని డిప్యూటీ సీఎం హెచ్చరించారు. బహుజనులు ఏకం కావాలి ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చింది బీసీ సబ్ ప్లాన్ డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలోచన చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి, జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేసినప్పుడే సకల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎన్ని అవాంతరాలు వచ్చినా నిటారుగా నిలబడుతుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. భారతదేశంలో కులం అనేది వాస్తవం అధికారంలోకి రాగానే కుల సర్వే చేపడతామని మా నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుల సర్వే చేసి రాష్ట్రంలో 56 మంది బీసీలు ఉన్నారని తమ ప్రభుత్వం లెక్క కట్టి చెప్పిందని తెలిపారు. వంద సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారు కుల సర్వే చేశారు ఆ తర్వాత దేశంలో కుల సర్వే చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి బిల్లును గవర్నర్ కు పంపాం, ఆయన కేంద్ర ప్రభుత్వానికి పంపగా అక్కడ బిల్లు పెండింగ్ లో ఉందని తెలిపారు. మహాత్మ పూలే ఆలోచనలను ఏ చిన్న అవకాశం దక్కిన, ప్రతి సందర్భంలో పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కుల వివక్ష, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుంగిపోకుండా తట్టుకొని నిలబడాలి అని ఆచరించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలబడ్డారు అందుకే మహాత్మా పూలే మహానుభావుడు అయ్యారు అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓసి అన్ని వర్గాల పిల్లలు 12వ తరగతి వరకు ఒకే చోట చదువుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ 200శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని, మన బిడ్డలు ఎవరు అర్ధాకలితో ఉండకూడదనే మంచి ఉద్దేశంతో ప్రతిరోజు నాణ్యమైన డైట్ ను అందించడమే కాదు వాటిని పర్యవేక్షించేందుకు చీఫ్ సెక్రటరీ నుంచి మండల స్థాయి అధికారి వరకు సీఎం నుంచి సర్పంచి వరకు గురుకులాలు సంక్షేమ వసతి గృహాలు సందర్శించాలి అవసరమైతే అక్కడే నిద్రించాలని నిబంధన పెట్టి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పథకం ప్రారంభిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు.

# ఎప్పుడు ఎన్నికలొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలే

మొదటి తరువాయి

అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మిదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగొట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తడ్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

## బిఆర్‌ఎస్‌లోకి వెళ్లి జీవన్
# రెడ్డి తప్పు చేశారు

మొదటి తరువాయి

ఇప్పటికే బిఆర్‌ఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమయ్యిందో చూశామని అన్నారు. బిఆర్‌ఎస్‌లో కుటుంబానికే ప్రాధాన్యమని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులతో జేబులు నింపుకోవడంతోనే కాళేశ్వరం కూలిపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు.

# యూపీఐ పేమెంట్స్‌కు పదేళ్లు పూర్తి..

మొదటి తరువాయి




21.70 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.28.33 లక్షల కోట్లు.దేశంలోని మొత్తం రిటైల్ డిజిటల్ లావాదేవీల్లో 81 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ప్రారంభమైన నాటి నుంచి లావాదేవీల పరిమాణంలో 12,000 రెట్లు, విలువలో 4,000 రెట్లకు పైగా వృద్ధిని యూపీఐ నమోదు చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ సైతం యూపీఐని ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపుల వ్యవస్థగా అభివర్ణించింది. కేవలం లావాదేవీల సంఖ్యకే పరిమితం కాకుండా యూపీఐ సామాన్యుడి జీవితంలో కూడా భాగమైంది. ఆటోరిక్షా డ్రైవర్ల నుంచి వీధి వ్యాపారులు, గ్రామీణ మార్కెట్ల వరకు యూపీఐ సేవలు విస్తరించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య, అధికారిక, అనధికారిక ఆర్థిక వ్యవస్థల మధ్య అంతరాన్ని తగ్గించి, ఆర్థిక సమ్మిళితత్వానికి మార్గం వేసిందని ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొన్నది. భారత యూపీఐ వ్యవస్థ పనితీరు, భద్రత, వేగాన్ని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ప్రశంసించాయి. ప్రస్తుతం యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా 8 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యూపీఐ లైట్, యూపీఐ ఆటోపే, క్రెడిట్ ఆన్ యూపీఐ వంటి కొత్త సేవలను కూడా అందుబాటులోకి తెచ్చారు. దశాబ్ద కాలంలోనే దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ, నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలవడం గమనార్హం.

## వేప చెట్లను కాపాడండి...
# ప్రకృతిని పరిరక్షించండి

**రంగారెడ్డి, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలుగు రాష్ట్రాల్లో వేప చెట్లను డై బ్యాక్ వ్యాధి వేగంగా ప్రభావితం చేస్తూ ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. అనేక ప్రాంతాల్లో వేప చెట్లు కొమ్మల చివర నుంచి మాడిపోతూ పూర్తిగా ఎండిపోతున్నాయి. సర్వరోగ నివారిణిగా పేరుగాంచిన వేప చెట్టుకే వ్యాధి సోకడం పర్యావరణ పరిరక్షణకు పెద్ద సవాల్‌గా మారింది.వేప చెట్టు ఔషధ గుణాలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. అయితే ప్రస్తుతం ఈ చెట్లపై వ్యాధి ప్రభావం పెరుగుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు.వ్యాధి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొమ్మల చివర నుంచి



ఎండిపోవడం, ఆకులు పసుపు రంగులోకి మారి రాలిపోవడం, చెట్టు క్రమంగా పూర్తిగా మాడిపోవడం ప్రధాన లక్షణాలుగా గుర్తించారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు వ్యాధి సోకిన కొమ్మలను వెంటనే తొలగించడం, చెట్టు చుట్టూ శుభ్రత పాటించడం, నిపుణుల సూచనల మేరకు ఫంగిసైడ్స్ పిచికారీ చేయడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.అటవీ మరియు వ్యవసాయ శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సరైన సమయంలో చర్యలు తీసుకోకపోతే వేప చెట్ల ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.వేప చెట్లను కాపాడటం అంటే ప్రకృతిని పరిరక్షించడమేనని, అందరూ కలిసి ముందడుగు వేయాలని పర్యావరణ ప్రేమికులు పిలుపునిస్తున్నారు.

## నల్గొండ డంపింగ్ యార్డ్ పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**నల్గొండ, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి , నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు.చెత్త రీసైక్లింగ్ మిషినరీ పనితీరును పరిశీలించి, నిర్వహణ ఖర్చుల వివరాలు తెలుసుకున్నారు. త్వరలోనే మిర్యాలగూడ డంపింగ్ యార్డ్‌లో చెత్తను పూర్తిగా రీసైకిల్ చేసి తొలగించే చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంలో మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, డిఈ వెంకన్న, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## స్త్రీ ఔనత్యాన్ని గౌరవించిన వ్యక్తి పూలే

**- చిక్కిరి శ్రీకాంత్**



**మహేశ్వరం, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పిస్తున్నామని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిక్కిరి శ్రీకాంత్ తెలిపారు.పూలే విద్యనే సమాజ అభివృద్ధికి మూలమని నమ్మి, వెనుకబడిన వర్గాలు, మహిళలకు విద్య అందించేందుకు తొలి బాలికల పాఠశాలను స్థాపించారని గుర్తుచేశారు. కులవివక్ష నిర్మూలన కోసం “సత్యశోధక సమాజ్”ను స్థాపించి సమానత్వం, న్యాయం కోసం పోరాడారని చెప్పారు.నేటి సమాజంలో కూడా ఆయన ఆలోచనలు ప్రాసంగికమని, యువత పూలే ఆశయాలను అనుసరించి ముందుకు సాగితే సమాజం మరింత సమానత్వంతో అభివృద్ధి చెందుతుందని శ్రీకాంత్ పేర్కొన్నారు.

## అతిథి అధ్యాపకులను కొనసాగించాలని ప్రిన్సిపాల్‌కు వినతి




**దేవరకొండ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు తమ సేవలను వచ్చే విద్యా సంవత్సరం కూడా కొనసాగించాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవికి వినతి పత్రం అందజేశారు.అతిథి అధ్యాపక సంఘం అధ్యక్షుడు బి. సురేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా నెలకు రూ.50,000 వేతనం, 12 నెలల కన్సాలిడేట్ జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వీసును ఆటో రెన్యువల్ చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఏ. శ్రీను, కోశాధికారి పి. కొండల్, కార్యదర్శి ఎం. జగపతిబాబు, జిల్లా కమిటీ సభ్యులు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగించాలి

**-- సర్పంచ్ రెంటాల కృష్ణ**



**కురవి, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సామాజిక విప్లవకారుడు మహనీయుడు జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా నల్లెల్ల గ్రామ పంచాయతీలో ఆయన చిత్రపటానికి సర్పంచ్ రెంటాల కృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, బహుజనులకు చదువే అభివృద్ధి మార్గమని సూచించి, మహిళా విద్యను ప్రోత్సహించిన పూలే త్యాగాలు మరువలేనివని అన్నారు. సావిత్రిబాయి పూలేను చదివించడంతోపాటు మహిళా పాఠశాలలు స్థాపించడం, భ్రూణహత్యలను నిరోధించడం, విధవలకు ఆశ్రమాలు ఏర్పాటు చేయడం వంటి సేవలను గుర్తుచేశారు.పూలే ఆశయాలను ఆచరించడం సమాజాభివృద్ధికి అవసరమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నిమ్మలగంటి కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు మహిపాల్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువజన సంఘం నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి పల్లకీ సేవ



**షాద్‌నగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన బృందం ఆధ్వర్యంలో స్వామివారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. శ్రీరామ జయరామ నినాదాలతో ఊరేగింపు సాగి, ఆలయం భజనలతో మార్మోగింది.ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, స్థానిక నాయకులు, భజన బృందం మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయసాధనకై పనిచేయాలి

**- అడ్వకేట్ ఎర్ర కృష్ణ జాంభవ్**



**దేవరకొండ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డివైజేఏసి రాష్ట్ర చైర్మన్, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ మాట్లాడుతూ, పూలే అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది అని అన్నారు.ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు




**వంగూరు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు వంగూరు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదయ్య, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు గణేష్, కమిటీ సభ్యులు, పంచాయతీ వార్డు సభ్యులు, ఇతర పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు




**దేవరకొండ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అధ్యక్షుడు ఎన్.విటి సభ్యులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా విద్యకు పునాదులు వేసిన గొప్ప సంఘసంస్కర్త పూలే కులవివక్షపై పోరాడి సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. యువత ఆయన ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాళ్ళ శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, స్థానిక నాయకులు, క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**యాచారం ,ఏప్రిల్ 11( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు యాచారం మండలం నక్కర్త - మేడిపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజ సంస్కరణల పట్ల చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా, మండల కమిటీ సభ్యులు ఆలంపల్లి. జంగయ్య, ముచ్చర్ల లాజర్, గ్రామ శాఖ కార్యదర్శులు గడ్డం కుమార్,



వడ్డేమోని భూషణ్, ఆలంపల్లి యాదయ్య 9th వార్డ్ సభ్యులు ఆలంపల్లి మహేష్ మరియు పార్టీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో ఎస్‌బిఐ బ్యాంకులో రూ.2.30 కోట్ల ఘరానా మోసం






**దేవరకొండ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉమ్మడి నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకు శాఖలో రూ.2.30 కోట్ల భారీ మోసం వెలుగులోకి వచ్చింది. బ్యాంకులో పనిచేసే ఓ కాంట్రాక్టు ఉద్యోగి సుప్తావస్థలో ఉన్న అకౌంట్ల నుంచి డబ్బులను డ్రా చేసినట్లు సమాచారం.కేవైసీ అప్డేట్ పేరుతో బ్యాంకు లొసుగులను ఉపయోగించుకున్న అతడు, లండన్‌లో ఉన్న వినియోగదారుడి ఖాతా నుంచి కోటి రూపాయలకు పైగా డబ్బు డ్రా చేయడంతో విషయం బయటపడింది. ఫోన్‌లో లావాదేవీల మెసేజ్ రావడంతో అప్రమత్తమైన వినియోగదారు ఫిర్యాదు చేయడంతో ఈ అవినీతి బహిర్గతమైంది.మోసానికి పాల్పడిన కాంట్రాక్టు ఉద్యోగి పరారీలో ఉన్నట్లు తెలిసింది. బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఘటనతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**వెల్దండ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు వెల్దండ మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఘనంగా జరిగాయి. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఈదులపల్లి అనిల్, నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రీమియర్ లీగ్-8 ప్రారంభం




**వెల్దండ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండలంలోని కొట్ర గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రీమియర్ లీగ్-8ను గ్రామ సర్పంచ్ శారద చెన్నయ్య ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ యువత క్రీడల్లో ముందుకు రావాలని, క్రీడలు ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామస్థులు ఇటువంటి కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సమితి అధ్యక్షుడు పోనుగోటి రవీందర్రావు, యువకులు, క్రీడాకారులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏబీఎన్ సంస్థల అధినేతపై ఫిర్యాదు



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఏబీఎన్ సంస్థల అధినేత రాధాకృష్ణ ఈ నెల 4వ తేదీన ప్రసారమైన కార్యక్రమంలో మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై మాజీ శాసనసభ్యులు శ్రీ గంగుల బ్రిజేంద్ర రెడ్డి గారు ఆళ్లగడ్డ అర్బన్ పోలీస్ స్టేషన్ లో రాధాకృష్ణపై ఫిర్యాదు చేసి, వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆబ్కారీ శాఖ డీసీ సోమిరెడ్డిని అకారణంగా దూషించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

**-పూర్తి స్థాయి విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి**
**-తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్..**



**హైదరాబాద్, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిజామాబాద్ డివిజన్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డిని అకారణంగా ఆ శాఖ కమిషనర్ దూషించడాన్ని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ ఓడనాల రాజశేఖర్ తీవ్రంగా ఖండించారు. తోటి అధికారి అని కూడా చూడకుండా పరుష పదజాలంతో దూషించి, అవమాన పర్చిన ఆబ్కారీ శాఖ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ డివిజన్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డిని శుక్రవారం అదే శాఖ కమిషనర్ తోటి అధికారుల, సిబ్బంది ముందు పరుషపదజాలంతో దూషించడంతో పాటు తీవ్రంగా అవమానపర్చారని ఆరోపించారు. కమిషనర్ దూషణలతోనే సోమిరెడ్డి తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయి ఆస్పత్రి పాలయ్యారన్నారు. 30 ఏళ్లుగా ఆబ్కారీ శాఖకు సేవలందిస్తున్న ఉత్తమ అధికారి సోమిరెడ్డిని కమిషనర్ అకారణంగా దూషించడం చాలా బాధకరంగా ఉందన్నారు. అన్ పార్లమెంటరీ భాషతో తోటి అధికారుల, సిబ్బంది ముందు పరుష పదజాలంతో దూషించాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు. ఉద్యోగులను దూషిస్తూ, వారి జీవితాలతో ఆడుకునే హక్కు ఏ ఒక పై అధికారికి లేదని స్పష్టం చేశారు. సోమిరెడ్డి చేయని తప్పుకి " వెధవ , ఇడియట్" అంటూ ఉన్నత స్థాయిలో ఉన్న కమిషనర్ మాట్లాడే అధికారం ఎక్కడదని ప్రశ్నించారు. కింది స్థాయిలో అధికారులు, సిబ్బంది ఏదైనా తప్పు చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకునే అధికారం ప్రతి అధికారికి ఉంటుందని గుర్తు చేశారు. కానీ, నోరు పడేసుకోని ఉద్యోగులను అవమానపరుస్తూ, భయభ్రాంతులకు గురి చేసే పద్దతి మంచిది కాదన్నారు. ఉద్యోగులను దూషిస్తూ, అవమానపరుస్తున్న ఆబ్కారీ శాఖ కమిషనర్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ తక్షణమే స్పందించాలన్నారు. నిజామాబాద్ ఘటనపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆబ్కారీ కమిషనర్‌ను ఆ శాఖ నుంచి తప్పించాలన్నారు. దీంతో విచారణ పారదర్శకంగా సాగుతుందన్నారు. ఇదే విషయమై త్వరలోనే తెలంగాణ ఉద్యోగుల జేఏసీగా సీఎం రేవంత్‌రెడ్డి గారిని, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుగారిని, సీఎస్ గారిని కూడా కలువనున్నట్టుగా చెప్పారు. ఆబ్కారి శాఖ కమిషనర్ తీరుపై మాట్లాడటంతో పాటు చర్యలకు కూడా డిమాండ్ చేస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలకు తావు లేకుండా ఉండాలనే విషయాన్ని కూడా ప్రభుత్వ పెద్దలను కోరనున్నట్టుగా తెలిపారు.

## అంతర్రాష్ట్ర డీజిల్ దొంగల ముఠా పట్టుబడింది



**నల్గొండ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ రహదారులపై వాహనాల నుంచి డీజిల్ దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నల్గొండ పోలీసులు అరెస్టు చేశారు. చిట్యాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నెం. 98/2026 కేసులో ఒక మైనర్‌తో సహా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.దాడిలో 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎం వాహనాలు, ఆరు మొబైల్ ఫోన్లు, వరి పొట్టు కవర్లు స్వాధీనం అయ్యాయి. వీటి విలువ దాదాపు 40 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాకు చెందిన నిందితులు తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా కేసుల్లో పాలుపంచుకున్నట్లు దర్యాప్తులో బయటపడింది.డీఎస్పీ కె. శివరామ్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, ఏప్రిల్ 10 రాత్రి గస్తీ సమయంలో అనుమానాస్పద వాహనాన్ని అడ్డగట్టి డీజిల్ క్యాన్‌లను కనుగొన్నారు.రాత్రిపూట లారీలు, ట్రక్కులు ఆగి ఉన్నప్పుడు డ్రైవర్లు నిద్రలో ఉండగా డీజిల్ దొంగిలించేవారని పోలీసులు తెలిపారు. అదనపు ఎస్పీ జి. రమేష్ వాహన యజమానులు అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఆధునిక సమాజపు కాంతిరేఖ జ్యోతిరావు పూలే



**నల్గొండ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేవీపీఎస్ ఆధ్వర్యంలో నల్గొండలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద గడియారం సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ, పూలే విద్య అనే ఆయుధంతో అసమానతలపై పోరాడి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేశారని, మహిళా విద్యాభివృద్ధికి తొలి బాలికల పాఠశాలను స్థాపించడం ఆయన గొప్ప సేవగా నిలిచిందని అన్నారు. సత్యశోధక్ సమాజ్ ద్వారా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తుచేశారు.ప్రస్తుత విద్యా విధానాలు అట్టడుగు వర్గాలను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నాయని విమర్శిస్తూ, పూలే ఆశయాల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం, గీత కార్మిక సంఘం, ఉద్యోగుల సంఘం నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే కు ఘన నివాళి..



**అంబర్పేట్, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రచయిత, మేధావి,కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త శ్రీ జ్యోతిభ పూలే 200 వ జయంతి సందర్భంగా అంబర్ పేట్ అలీ కేఫ్ చౌరస్తా వద్ద పూలమాలతో నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ స్టీవెన్ సన్, బి.జాన్, వర్కల శ్రీకాంత్, భాను దాస్, అశోక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడలో ఉపాధి హామీ కూలీల అవస్థలు



**మర్రిగూడ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నుంచి నాలుగు వారాలుగా చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో జీవనం భారమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

## దివ్యాంగుల సమస్యలపై కేంద్రమంత్రికి వినతి పత్రం



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టూరిజం ప్లాజాలో కేంద్ర ఎంపవర్మెంట్ మంత్రి రాందాస్ అతావలేను కలిసిన తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్ దివ్యాంగుల సంక్షేమ పథకాలపై వినతి పత్రం అందజేశారు.వికలాంగులకు రాయితీ లోన్లు, ముద్ర పథకం, రైల్వే పాసులు, పెన్షన్ పెంపు వంటి అంశాలను వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, క్యాబినెట్‌లో చర్చించి త్వరలోనే లాభం కలిగేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పహాడీషరీఫ్‌లో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా బట్టబయలు




**తుక్కుగూడ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్ పోలీసులు తెల్లవారుజామున పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను గుర్తించి కేసు నమోదు చేశారు.జామా మసీదు సమీపంలో వాహనాల తనిఖీల్లో TS13UB6510 నంబర్ గల ట్రాలీ ఆటోలో 50 కిలోల చొప్పున 16 బస్తాలు (మొత్తం 8 క్వింటాళ్లు) బియ్యం స్వాధీనం చేశారు. డ్రైవర్ లిరామ్ జీవన్ సాని (52)లిను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో, వాజిద్ అలియాస్ ఫయాజ్ సూచనల మేరకు రేషన్ కార్డు దారుల నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు బయటపడింది.పోలీసులు బియ్యం, వాహనాన్ని పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఇతర సంబంధిత వ్యక్తులను పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. అవసర సరుకుల అక్రమ మళ్లింపును అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఎలిగేడు బస్టాండు వద్ద
# చలివేంద్రం ప్రారంభం




**ఎలిగేడు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేసవిలో మండుతున్న ఎండల దాహార్తిని తీర్చేందుకు ఎలిగేడు మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్ చేతుల మీదుగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో, ప్రజలకు జలదానం ఎంతో ఉపయోగకరమని, గ్రామాల నుండి వచ్చే ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తుందని వారు పేర్కొన్నారు.ట్రస్ట్ అధ్యక్షుడు కట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వీరగోని లక్ష్మీనారాయణ కృషిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎలిగేడు లో జ్యోతిరావు
# పూలే జయంతి వేడుకలు



**ఎలిగేడు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంపిణీ చేశారు.మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కూడా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పల్లెర్ల వెంకటేశ్ గౌడ్ (నర్సాపూర్ సర్పంచ్), సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైస్సార్సీపీ కార్యకర్త కుమారుని వివాహ శుభకార్యక్రమం నకు హాజరు అయిన కాటసాని బ్రదర్స్

**బనగానపల్లె, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం శ్రీ మద్దిలేటి దేవస్థానం నందు అవుకు మండలం గుండ్ల సింగవరం గ్రామానికి చెందిన తిరిపిగారి మద్దిలేటి కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,అవుకు మండల వైయస్సార్ సిపి పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి తదితరులు

# అంబేద్కర్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం



**ఎలిగేడు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా జయంతోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పండుగలా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఎలిగేడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా, బస్టాండు ఆవరణలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి వేడుకల్లో కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పెద్దపల్లి కమాన్ చౌరస్తా నుంచి కోలాటం, డప్పు చప్పుళ్లతో అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుండి ప్రజలు జిల్లా కేంద్రంలో జరిగే వేడుకల్లో భాగస్వాములై మహనీయునికి ఘనంగా నివాళులర్పించాలని కోరారు.ఈ కార్యక్రమానికి ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు కమిటీ చైర్మన్ మామిడిపల్లి బాపయ్య తెలిపారు. సర్పంచులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ సమక్షంలోసాగర్ రోడ్‌లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**పెద్దపల్లి, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి పట్టణంలోని సాగర్ రోడ్‌లో శనివారం ఉదయం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టారు. ఇళ్లను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, ఒక ట్రాలీని సీజ్ చేశారు. అదనంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వారి వద్ద నుండి మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ జి.కృష్ణ మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు. వేరే రాష్ట్రాల నుండి వచ్చి కిరాయికి ఉంటున్న వారి గుర్తింపు వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. నెంబర్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ ఆపరేషన్‌తో పట్టణంలో చట్టవ్యవస్థను కాపాడేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని ప్రజలు అభినందించారు.

## ట్రాఫిక్ సిబ్బందిచే బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ



**కరీంనగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ బస్టాండ్ కూడలి వద్ద ట్రాఫిక్ సిబ్బంది శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది ప్రజలకు ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని, ఓవర్ స్పీడ్‌లో వెళ్లరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. అదనంగా పెండింగ్‌లో ఉన్న చాలాన్లను క్లియర్ చేయాలని, గడువు ముగిసిన వాహన పత్రాలను రీన్యువల్ చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీతో ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

## మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన ర్యాలీ





**మహబూబాబాద్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. జిల్లా అధికారి ఉమా రాణి మాట్లాడుతూ, యువత మత్తు మందులకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, మందుల దుకాణదారులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం విక్రయం బట్టబయలు

### - పహాడీషరీఫ్ పోలీసులు



**తుక్కుగూడ, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి నిర్వహించారు.సబ్‌ఇన్‌స్పెక్టర్ వి. లక్ష్మయ్య ఆధ్వర్యంలో బృందం అక్బర్ ఫంక్షన్ హాల్ ఎదుట ఉన్న సుభాష్ కిరాణా షాప్‌పై దాడి చేసి, కలివాల నరేష్ (50) వద్ద అనుమతి లేకుండా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 47 బాటిళ్లు (సుమారు 7.2 లీటర్లు) సీజ్ చేసి, పంచనామా నిర్వహించారు.నిందితుడు వైన్ షాపుల నుండి మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు దర్యాప్తులో బయటపడింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని నమూనాలను రసాయన పరీక్షలకు పంపారు.పహాడీషరీఫ్ పోలీసులు అక్రమ మద్యం విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

# వీధి కుక్కల బెడదతో భయాందోళనలో ప్రజలు



**కరీంనగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని పలు డివిజన్లలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా పెరిగి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సమావేశాల్లో స్థానికులు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీధి కుక్కలు స్వేచ్ఛగా తిరుగుతూ చిన్నపిల్లలపై, వాహనదారులపై దాడి చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకొని వీధి కుక్కలను బంధించి, టీకాలు వేసి, జనావాసాలు లేని ప్రాంతాల్లో విడిచిపెట్టాలని ప్రజలు కోరారు. అధికారులు ప్రజల విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించి త్వరలోనే సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ హామీతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

# చెట్లు, తీగలతో ప్రమాదంగా మారుతున్న ట్రాన్స్ఫార్మర్లు



**కరీంనగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలోని పలు డివిజన్లలో ట్రాన్స్ఫార్మర్లు చెట్లు, ఎండిపోయిన తీగలతో కప్పబడి ప్రమాదకరంగా మారాయి. ఎండాకాలం కావడంతో వేడి పెరిగి మంటలు వ్యాపించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలు సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ, ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచంలా కాంపౌండ్ వాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదం జరగకముందే తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏప్రిల్ 14న జరగనున్న అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నగర మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభాధ్యక్షులు ఎలుక ఆంజనేయులు, కార్యనిర్వహక అధ్యక్షులు సుద్దాల లక్ష్మణ్, కాడే శంకర్, దామెర సత్యం, బోలుమల్ల సదానందం, ఈసరి రవికిరణ్, గంటల రేణుక, కొండ్రా స్వరూప, గోసికి అజయ్, గజ్జల ఆనందరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పోస్టర్ ఆవిష్కరణకు సాక్ష్యమయ్యారు.జిల్లా కేంద్రంలో జరగనున్న అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## రోడ్డు మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టిన వేముల కవిత--చంద్రశేఖర్



**కరీంనగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక ప్రజల సౌకర్యార్థం కొత్తపల్లి బస్టాండ్ నుండి రైల్వే బ్రిడ్జి వరకు చేపట్టనున్న ప్రత్యేక రోడ్డు మరమ్మత్తు పనులను శనివారం అధికారికంగా ప్రారంభించారు.ఈ పనులను 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత--చంద్రశేఖర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్ కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ స్వర్గం వజ్రదేవి--నర్సయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ పర్శరాములు, 17, 18వ డివిజన్లకు చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. గుండేటి విశ్వనాథం, బుస రామకృష్ణ, పెంటి రాజమౌళి, గుండేటి సుధాకర్, చిప్ప శేఖర్, చిటుకూరి శ్రీనివాస్, మేకల పోచమల్లు, గుండేటి శ్రీనివాస్, పెంటి సుధాకర్, ఎలిగేటి రాజేందర్, వంగ చంద్రమౌళి, వంగ లక్ష్మీనారాయణ, ధ్యావనపెల్లి లక్ష్మీనారాయణ, కామారపు సాయి, దాసరి రాకేష్, పెంటి శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.రోడ్డు మరమ్మత్తులు పూర్తయితే ప్రయాణీకులకు, స్థానిక ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగుతాయని కార్పొరేటర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కరీంనగర్‌లో విద్యుత్ భద్రత చర్యలు



**కరీంనగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ టౌన్‌లోని ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న హై టెన్షన్ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం తొలగించారు.ఆ ప్రాంతంలో చెట్ల కొమ్మలు తీగలకు తగిలే ప్రమాదం ఉండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కొమ్మలను కత్తిరించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.ఈ చర్య వల్ల విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగడమే కాకుండా ప్రజల భద్రతకు కూడా దోహదపడుతుందని అధికారులు తెలిపారు. అదనంగా విద్యుత్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. ప్రజలు ఈ చర్యను అభినందిస్తూ, ఇలాంటి ముందస్తు చర్యలు తరచూ చేపట్టాలని కోరారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు

**కరీంనగర్ /హుస్నాబాద్/పెద్దపల్లి, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా కరీంనగర్, హుస్నాబాద్, ఉల్లంపల్లి గ్రామం, పెద్దపల్లి జిల్లాలో పలు ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. కరీంనగర్‌లో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, పార్టీ కార్పొరేటర్ బోట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు బద్రి నేత, శివా పాల్గొని పూలే సేవలను స్మరించారు. ఉల్లంపల్లి గ్రామంలో సర్పంచ్ అలువల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మండల తహసీల్దార్ ముద్దసాని రమేష్, మాజీ జెడ్పీటీసీ ఫ్లోర్ లీడర్ గీకూర్ రవీందర్, ఓయూ జేఏసీ చైర్మన్ గంపల శ్రీనివాస్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మార్క రాజు కుమార్ గౌడ్, బొమ్మనపల్లి సర్పంచ్ మౌనిక, లంబాడిపల్లి సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి, ఉపసర్పంచ్ కానవేని జితేందర్, కార్యదర్శి జ్యోతి, వార్డ్ సభ్యులు కొత్త మధు, సుధగోని ఇందిర, కోల రజిత, కోల స్వరూప, ప్రధానోపాధ్యాయుడు సాదిక్, మాసరదు అలీ, కానవేని శివకుమార్, బడుకొలు దేవేందర్, నాంపల్లి తిరుపతి, చీముర్తి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.హుస్నాబాద్ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, కౌన్సిలర్ గాదపాక రవీందర్, బిఆర్ఎస్ నాయకుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, జన జాగృతి అధ్యక్షుడు ముక్కెర సంపత్, అంబేద్కర్ సంఘం నాయకుడు తొందూరు ఎల్లయ్య, బీఎస్పీ నాయకులు మారేపల్లి సుధాకర్, దేగల వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రాములు దండి, కొమురయ్య, మాజీ సర్పంచ్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.కరీంనగర్‌లో పూలే బీసీ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న కురుమ, మ్యాకల పరశురాము, ఈరెల్ల విజయ్ కుమార్, నర్సింగోజు శ్రీనివాస్, గుంటి



స్వరూప, కర్రే పావని, మీస రమాదేవి, మీస మాధురి తదితరులు పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ పి. శివ నాగ ప్రసాద్, సోమశేఖర రావు, ఓబీసీ నాయకులు రవీందర్ జీ, సత్తయ్య, బుచ్చయ్య, నారాయణ, ప్రభాకర్ చారి పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కార్పొరేటర్లు వరాల నరసింగం, పర్వతాల మల్లేశం, గడ్డం శ్రీనివాస్, వెన్నం రజిత రెడ్డి, రాచకొండ ప్రభాకర్, వంగల విద్యాసాగర్, కామ్ రెడ్డి రామ్ రెడ్డి, కుంభాల రాజు కుమార్, రామిడి రాజిరెడ్డి, మూల జైపాల్, పులి అంజయ్య గౌడ్, నూనె గోపాల్ రెడ్డి, గడప శ్రీనివాస్, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకట్ రెడ్డి, సాయిని మల్లేశం, దులం కళ్యాణ్, కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, ఎన్నాం ప్రకాష్, బండ రమణ రెడ్డి, మాసం గణేష్, ఏపీపీ చంద్ర, సొగాని కొమురయ్య, కర్రే అనిల్, చొప్పరి జయశ్రీ, దేశి శిల్పా, తాటి ప్రభావతి, పెద్దపల్లి శ్రీలేఖ, నాంపల్లి శ్రీనివాస్, పొన్నం మొండయ్య, తణుకు సాయికృష్ణ, జాడి బాల్ రెడ్డి, పాదం శివరాజ్, అవుదుర్తి శ్రీనివాస్, ఆకుల రాజేందర్, గుజ్జు శ్రీనివాస్, అడి చేర్ల రాజు, పెద్దపల్లి జితేందర్, గుంజేటి శివ కుమార్, వెంకట రమణ, బల్బీర్ సింగ్, కచ్చా కాయల రాజు తదితరులు పాల్గొన్నారు.ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రేకుర్తి శాతవాహన యూనివర్సిటీ వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, కాంపెల్లి అరవింద్, గట్టు ఆకాష్, రాకేష్, అంజి పాల్గొన్నారు.మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా శాతవాహన యూనివర్సిటీ వద్ద పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలుక ఆంజనేయులు, కాడే శంకర్, గంటల రేణుక, భైరం కుమార్, నిజంపేట శ్రీనివాస్, జక్కుల బాబు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి. వేణు, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి జే. రంగా రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ బీసీ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమని, పూలే ఆశయాలను ఆచరించడం ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.సమాజసేవ, సమానత్వం, విద్యా ప్రాధాన్యత, మహిళా సాధికారత కోసం జీవితాంతం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల ఆశయాలను ప్రజలకు చేరవేసేలా ఈ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.

# దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన కోనేరుపల్లె గ్రామం

**గంగాధర, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని కోనేరుపల్లె గ్రామం జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది.గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల్ రాజు క్రీడా మిత్ర పంచాయతీ ప్రణాళికలో భాగంగా యువతను క్రీడల వైపు మళ్లించే విధంగా కృషి చేసి, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఈ కృషిని ప్రతిబింబించే వీడియోకు గాను భారత ప్రభుత్వం, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన సర్పంచ్ సంవాద్ యాప్ ద్వారా జాతీయ స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించారు.ఈ విజయాన్ని పురస్కరించుకొని చొప్పదండి శాసనసభ్యులు,




కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సర్పంచ్ వేణుగోపాల్ రాజును శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ గజ్జెల తిరుపతి, పాలకవర్గ సభ్యులు, ఎంపిడిఓ వేణుగోపాల్ రావు, ఎంపివో రాజగోపాల్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ లను అభినందించారు. కోనేరుపల్లె గ్రామ పాలకవర్గం అన్ని విధాలుగా సహకరిస్తున్న ఎమ్మెల్యే సత్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ విజయంతో కోనేరుపల్లె గ్రామం మాత్రమే కాకుండా చొప్పదండి నియోజకవర్గం, కరీంనగర్ జిల్లా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది.

# కేంద్ర మంత్రి రామ్‌దాస్ అత్‌వాలేను మర్యాదపూర్వకంగా కలిసిన జాతీయ మాలమహానాడు నాయకులు

**హుస్నాబాద్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్‌లోని మంజీర అతిథి గృహంలో జరిగిన ఆర్‌పీఐ(ఏ) పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి మరియు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ-ఏ) జాతీయ అధ్యక్షులు రామ్‌దాస్ అత్‌వాలేను జాతీయ మాలమహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆరె కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో, ఇటీవల మూడోసారి రాజ్యసభకు ఎన్నికైన సందర్భంగా కేంద్ర మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న దళిత, బహుజన సమస్యలను వివరించి, వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని



కోరారు.దీనికి స్పందించిన కేంద్ర మంత్రి రామ్‌దాస్ అత్‌వాలే, తెలంగాణలో ఆర్‌పీఐ(ఏ) పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని, పార్టీకి అనుబంధంగా కలిసి పని చేయాలని సూచించారు. దళిత, బహుజన హక్కుల కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు నియోజకవర్గ మీడియా సెల్ ఇంచార్జ్ జాల శ్రీనివాస్, హుస్నాబాద్ మండల నాయకులు సుంకె రమేష్, దేగల సతీష్, భీమదేవరపల్లి మండల నాయకులు డ్యాగాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశం ద్వారా దళిత, బహుజన సమస్యల పరిష్కారానికి కేంద్ర స్థాయిలో మరింత దృష్టి సారించబడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# 15వ వార్డులో చెత్త విభజనపై అవగాహన సదస్సు



**హుస్నాబాద్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని 15వ వార్డులో చెత్త విభజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు వ్యక్తిగత శుభ్రతతో పాటు పట్టణ పరిశుభ్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తగా వేరుచేసి పురపాలక వాహనాలకు అందించాలని సూచించారు. ప్రతి ఇంటి బాధ్యతగా చెత్త వేరు చేయాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో, డ్రైనేజీల్లో చెత్త వేయరాదని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని, ప్లాస్టిక్‌కు బదులుగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను వినియోగించాలని సూచించారు. నిల్వ నీటిని తొలగించడం, సెప్టిక్ ట్యాంకులను ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి శుభ్రపరచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. హుస్నాబాద్‌ను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ ఆకుల రజిత, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, వార్డ్ ఇన్‌చార్జ్ అధికారులు రాజమౌళి, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి 6 ఏళ్ల జైలు శిక్ష



**కరీంనగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపి ఒక మహిళ మృతికి కారణమైన నిందితుడికి కరీంనగర్ పిడిజె కోర్టు 6 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 6,500 జరిమానా విధిస్తూ కీలక తీర్పు వెలువరించింది. 2021 ఫిబ్రవరి 18న రాత్రి చొప్పదండి పరిధిలోని చెక్కల లచ్చయ్య సా మిల్ సమీపంలో వోడ్నాల నవీన్ కుమార్ (28) తన కారుతో మద్యం మత్తులో అతివేగంగా వస్తూ ఎదురుగా ఉన్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వడ్లూరి లక్ష్మి (50) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించింది. పలువురు ప్రయాణికులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. వడ్లూరి కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చొప్పదండి పోలీసులు సెక్షన్ 304-II ఐపీసి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో గౌరవ పిడిజె కోర్టు నిందితుడికి 6 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్యాల ప్రతాప్ వాదనలు వినిపించి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు. ఈ కేసులో సమర్థవంతంగా విధులు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్ట్ మానిటర్ సెక్షన్ ఏఎస్సై సత్తయ్య, కోర్ట్ డ్యూటీ కానిస్టేబుల్ శ్రీధర్లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలు తీస్తే కఠిన శిక్షలు తప్పవని ఈ తీర్పు ద్వారా పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. ఈ తీర్పు రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంచుతుందని అధికారులు పేర్కొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్
- అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడికి సన్మానం
- అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆహ్వాన పత్రిక అందజేత



**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. ఈనెల 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కడ్తాల్ పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ శుక్రవారం గంప వెంకటేష్ గుప్తాకు కడ్తాల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కంబాలపల్లి అంజి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అంజి ను శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం గంప వెంకటేష్ మాట్లాడుతూ.. కుల మత జాతి ప్రాంత భేదాలు లేకుండా అంబేద్కర్ అన్ని వర్గాలకు మేలు చేశారని గుర్తు చేసుకున్నారు. దేశ రాజ్యాంగ నిర్మాణం చట్టాల అమలులో అంబేద్కర్ పాత్ర మరువలేనిదన్నారు. అయన అత్యంత పేదరికంలో పుట్టి చిన్నతన్నంలో ఎన్నో కష్టాలు అనుభవించి చదువు ద్వారా రాజ్యాంగ నిర్మాతగా ఎదిగారని తెలిపారు. నేటి సమాజం అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ చిన్నతనం నుండే ప్రతి ఒక పౌరుడు దేశభక్తితో, జాతీయ భావాలను కలిగి ఉండాలని సూచించారు.

## కోర్టు భవనానికి స్థలం కేటాయించాలి



**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం కేటాయించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాదులో ఎమ్మెల్యే నివాసంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్ లతో కలిసి వినతి పత్రం అందజేశారు. కోర్టుకు సొంత భవనం లేక మండల పరిషత్ పాత సమావేశం మందిరంలో కొనసాగుతుందని తెలిపారు. కోర్టు భవన నిర్మాణానికి పట్టణ సమీపంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. అందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు యాదిలాల్ తెలిపారు. వారం రోజుల్లో స్థలాలను పరిశీలించి కేటాయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. స్థల కేటాయింపు పూర్తి కాగానే భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని యాదిలాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, నాయకులు ఖాదర్ ఖాద్రి, పూసల సత్యం, మహబూబ్ అలీ, విజయ్ నాయక్, మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ ముహూర్త కార్యక్రమానికి హాజరైనా చల్లా శ్రీలక్ష్మి



**బనగానపల్లె, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె గ్రామానికి చెందినా, శ్రీమతి కారపాకుల సుబ్బలక్షమ్మ ఊ శ్రీ కారపాకుల పాపయ్య కుమార్తె వివాహ ముహూర్త కార్యక్రమానికి ఈరోజు స్వర్గీయ ఎమ్మెల్సీ శ్రీ చల్లా భగీరథ రెడ్డి సతీమణి శ్రీ చల్లా శ్రీలక్ష్మి "చింతలాయపల్లె గ్రామంలోని వధువు స్వగృహం చేరుకొని పెళ్లి పీటలు ఎక్కబోతున్న నూతన వధువును అక్షింతలు వేసి ఆశీర్వదించడం జరిగింది. అనంతరం రేపు జరగబోయే వివాహ కార్యక్రమం గురించి కుటుంబ సభ్యులను, బంధువులను అడిగి తెలుసుకొని వారితో సరదాగా మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో చల్లా రాజ్యాభిషేక రెడ్డి, చల్లా జూ"ని రామకృష్ణారెడ్డి, చల్లా శ్రీలక్ష్మి కార్యకర్తలు, పాల్గొన్నారు.

## గుగ్గిళ్ళ దత్తు పార్థివ దేహానికి నివాళి



**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ గుర్రం గుట్ట కాలనీకి చెందిన గుగ్గిళ్ళ దత్తు (28) గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము శుక్రవారం మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దత్తు తండ్రి భూపాల్ నాగరాజు ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అండగా ఉంటా అధైర్య పడొద్దు అని భరోసా కల్పించారు. తనవంతు సహాయంగా ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట శ్రీను నాయక్, వినోద్, సిద్ధూ, ఆంజనేయులు, రమేష్, జగన్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా సర్పంచ్ మహేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నిరంతరం ప్రజాసేవలో ప్రయాణం చేసే యువ నాయకులు సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, స్నేహితులు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి పూలమాల శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. సర్పంచ్ మహేందర్ గౌడ్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తు రాజకీయాల్లో ఉన్నత స్థాయిలో ఎదగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. చరికొండ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామస్తులు, వార్డు సభ్యుల సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యకర్తలే తన బలమని, వారి అండదండలతో ప్రజా సేవలో ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యా, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ సారించాలి

- లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి



**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మాడుగుల మండలం నాగిళ్ళ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉంది విషయం తెలుసుకున్న క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి శనివారం మరమ్మత్తు పనులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాలకుర్ల రాజ్ గౌడ్, ఉప సర్పంచ్ కంచర్ల సత్తయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న వసతులకు తోడుగా, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు పాఠశాల అభివృద్ధికి సహకరించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ వల్ల విద్యార్థులకు సీజనల్ వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వి. బిక్షపతి, సూర్య ప్రకాష్ రెడ్డి, జి. శ్రీనివాస్, జహంగీర్ అలీ, మల్లేష్, పిఆర్‌ఓ పాషా మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి



**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఏప్రిల్ 14న నిర్వహించే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం ఫౌండర్ బైండ్ల భీమయ్య, గౌరవాధ్యక్షులు గోరటి దేవేందర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఆలేటి నారాయణ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ అందరి వాడన్నారు. ఆయన త్యాగంతో ఏర్పడిన భారత రాజ్యాంగం అన్ని వర్గాలకు, అన్ని వ్యవస్థలకు రక్షణ కల్పిస్తుందన్నారు. కాబట్టి కుల, మత, ప్రాంతీయ విభేదాలు లేకుండా అందరూ కలిసి అంబేద్కర్ జయంతి నిర్వహించడం మనందరి బాధ్యత అని అన్నారు. అదేవిధంగా ఈనెల 19న అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని తీర్మానం చేశారు. కార్యక్రమంలో పులికంటి మైసయ్య, వస్పుల సాయిలు, లండం చిన్న జంగయ్య, పుల్లారెడ్డి శ్రీశైలం, రేవల్లి రాజు, జంతుక శేఖర్, సురేష్, శంకర్ జంతుక, వస్పుల మహేష్, మహేష్, శ్రీశైలం, అశోక్, వెంకటెష్,రామకృష్ణ, చలిచీమల సతీష్, జంతుక కిరణ్, రమేష్, నాగిల్ల లక్ష్మణ్, అబ్బు, అనీఫ్, అప్సర్, గోపి, శివ కార్తీక్, రాము, శేఖర్, విక్టర్, శ్రీరాములు, సంతోష్, మీసాల వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# పూలే ఆశయాలే సమసమాజానికి మార్గం

- జిల్లా పోలీస్ అధికారులు



**బాపట్ల ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకాలని జిల్లా పోలీస్ అధికారులు పేర్కొన్నారు. మహాత్మా పూలే జయంతి సందర్భంగా శనివారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో, పోలీస్ అధికారులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుల వివక్షత, అంటరానితనం వంటి అన్యాయాలకు వ్యతిరేకంగా పూలే చేసిన పోరాటం చరిత్రాత్మకమని గుర్తుచేశారు.బాలికల విద్యాభివృద్ధి కోసం 1848లో పూణేలో తొలి పాఠశాల స్థాపించి స్త్రీ విద్యకు పునాది వేసిన మహనీయుడిగా పూలే నిలిచారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు. సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణకు ఆయన చూపిన దారిలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బి సీఐ నారాయణ, సోషల్ మీడియా సీఐ సూర్యనారాయణ, మహిళా పీఎస్ సీఐ ఉమేష్, ఆర్ఎస్ఐ శ్రీనివాసరావు, సీసీ హరికృష్ణతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా యువ నాయకుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి జన్మదిన వేడుకలు



**డోన్ ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్**
డోన్ నియోజకవర్గం లోని యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్యాపిలి, బేతంచర్ల డోన్ పట్టణంలోని పాతబస్తాండ్ వద్ద పట్టణ మరియు మండల నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా అన్నదాన కేక్ కటింగ్ ,మరియు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాఘవేంద్ర రెడ్డి ప్రజల పట్ల ఉన్న నిబద్ధత, సేవా తత్వం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువత నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం..

- అంబలి కేంద్రానికి ప్రజల నుండి చక్కటి స్పందన
- లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్




**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మానవ సేవే మాధవ సేవా అని వృద్ధులకు, బాటసారులకు లయన్స్ క్లబ్ అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో గత మూడు వారాలుగా నిర్విరామంగా కొనసాగుతున్న అంబలి కేంద్రాన్ని చెన్న కిషన్ రెడ్డి, గంప వెంకటేష్ గుప్త లు శనివారం పర్యవేక్షించారు. ప్రజల నుండి చక్కటి స్పందన లభిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా సామాన్య ప్రజలు, ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ చల్లటి రాగి అంబలి కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రతిరోజూ దాదాపు 300 మందికి అంబలిని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ లయన్ జీ. చెన్న కిషన్ రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమం వేసవి కాలం ముగిసే వరకు సుమారు 60 రోజులపాటు కొనసాగుతుందని వివరించారు. ఈ సేవ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్ గుప్తా, లియో క్లబ్ అధ్యక్షులు శ్యాంసుందర్, లయన్ సభ్యులు మహేష్, పిప్పళ్ళ వెంకటేష్, చింటూ, లడ్డు, తరుణ్, ఆర్గనైజర్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుడు.. మహాత్మా పూలే

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేష్



**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని.. భారత గడ్డపై పుట్టడం మన అందరి అదృష్టమని బీసీ సంఘం అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేష్ అన్నారు. శనివారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి ఉత్సవాలకు సర్పంచ్ రాయికంటి బిక్షపతి, సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరై బీసీ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ తో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో మార్పులకు జ్యోతిరావు పూలే ముఖ్య కారణమన్నారు. నాడు సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి సామాజిక మార్పు తీసుకొచ్చిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే ఎంతగానో శ్రమించారన్నారు. ఈరోజు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంద న్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అబ్బు రమేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కంబాలపల్లి అంజి, ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి వార్డు సభ్యులు కళ్యాణ కార్ భానుకిరణ్, ముత్తి కృష్ణ, మంకి మహేష్, నాయకులు లాయక్ అలీ, తిరుమలేశ్వర్, కదారి రామకృష్ణ, జహంగీర్ బాబా, చేగురి మహేష్, దుడ్డు నాగరాజు, పెరుమల్ల మల్లయ్య, కర్రోళ్ల రమేష్, దోనాదుల మహేష్, క్యామ చంద్రశేఖర్, కార్తీక్ గౌడ్, సిద్దిగారి సురేష్, కాలే శ్రీను యువకులు కంటేకార్ నరేష్, తరుణ్, శ్యామ్ సుందర్ గౌడ్, చింటూ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమాజాన్ని సమాజాన్ని సంఘటితం చేయాలి

- పూజ్య శ్రీ ఆచార్య కృష్ణ నంద స్వామి
- ఆమనగల్లులో ఘనంగా హిందూ సమ్మేళనం






**ఆమనగల్లు, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హిందూ సమాజాన్ని సంఘటితంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని శ్రీగిరి అష్టలక్ష్మి క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు పూజ శ్రీ ఆచార్య కృష్ణ నంద స్వామి, తెలంగాణ ప్రాంత ధర్మ జాగరణ నిధి ప్రాముఖ్ ముఖ్యవక్త ఏడుదొడ్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో విశ్రాంత ఉపాధ్యాయులు నల్లబోలు సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. హనుమ దేవాలయం నుండి మానస గార్డెన్ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సమాజాన్ని చైతన్యవంతం చేసినప్పుడే భారతదేశం ప్రపంచానికి విశ్వగురువు అవుతుందని అన్నారు. హిందూ సంస్థలు పట్టణ, గ్రామాల్లోని ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించాలని అన్నారు. హిందువులందరినీ సంఘటితం చేయడంతో పాటు హిందూ సంప్రదాయాలు భావితరాలకు అందడం ద్వారా దేశభక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. హిందువులు సంఘటితమై హిందూ ఐక్యతను, సామరస్యతను చాటాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో మహిళా వక్త శ్రీమతి నాగశ్రీ (రాష్ట్ర సేవికా సమితి), ఖండ కార్యవాహ చుక్క ఆనంద్, మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, బి అంజయ్య, డి విశ్వనాథం, డి సత్యం, యాదిరెడ్డి, చెక్కల లక్ష్మణ్, గణేష్, పాపిశెట్టి రాము, చుక్క అల్లాజీ గౌడ్, మంచిని రాజు, గోజే ఆనంద్ మరియు మాతృమూర్తులు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

# కత్తిపోటు కలకలం

**కుటుంబ కలహాలతో మామ, భార్యపై అల్లుడు దాడి**



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్**
ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని సిరివెళ్ల మండలం గోవిందపల్లే గ్రామంలోని ఎస్సీ కాలనీలో శనివారం కుటుంబ కలహాలు రక్తపాతానికి దారి తీశాయి. కుటుంబ విభేదాల నేపథ్యంలో అల్లుడు చంద్రశేఖర్ కత్తితో దాడి చేయగా, ఇట్టే వెంకటేశ్వర్లు అతని కుమార్తె సంజమ్మ గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు, కుటుంబ వ్యవహారాలపై ఏర్పడిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో చంద్రశేఖర్ ఆగ్రహంతో కత్తితో దాడి చేశాడు. దాడిలో వెంకటేశ్వర్లు, సంజమ్మలకు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు మరియు స్థానికులు వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటనపై సిరివెళ్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధుసూధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దాడికి గల పూర్తి కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. గ్రామంలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.